క్లుప్తంగా

ఆలయాలకు విరాళాలు



విరాళం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని జయవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాలకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి రూ.30 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్మిస్తున్న ఆలయాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడి ఆలయాల నిర్మాణం కోసం తన వంతుగా విరాళాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ తూం భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ చెట్టిపల్లి నర్సయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎంద్రాల నాగరాజు, గౌడ సంఘం అధ్యక్షుడు సార నర్సయ్య, మల్లేశం, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఆయనను సత్కరించారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో సైబర్ నేరాలపై పోలీసులు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఇంటర్‌నెట్ వినియోగం ఎక్కువగా ఉన్న తరుణంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, వీటిపై అప్రమత్తంగా ఉండి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. మీ అకౌంట్‌లో డబ్బులు పోయిన 24 గంటల లోపుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బులు వెనక్కి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరిస్తూ, సంబంధించిన ధ్రువీకరణపత్రాలు వెంట ఉండాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే వాహనదారుడిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



కల్వర్టును పరిశీలిస్తున్న సీపీఐ బృందం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల రెండో బైపాస్‌లో కల్వర్టుల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. గురువారం కబ్జాలకు గురవుతున్న కల్వర్టులను సీపీఐ బృందం సభ్యులు పరిశీలించి మాట్లాడారు. ముష్టిపల్లి శివారులోని ఊర చెరువు నుంచి చంద్రంపేట శివారులోని ఈదుల చెరువులోకి నీరు వెళ్లే కాలువ కల్వర్టులను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారన్నారు. దీని వల్ల వరదలతో రాజీవ్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, లక్ష్మణ్, మోహన్, నాగరాజు పాల్గొన్నారు.

హరితహారం.. ప్రణాళిక లోపం

- రెండు లక్షల మొక్కలు లక్ష్యం
- ఇప్పటికీ బ్లాక్‌లను గుర్తించని వైనం
- మొక్కలు నాటేందుకు స్థలాభావం

ముస్తాబాద్: హరితహారం కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ప్రతి సంవత్సరం జూన్, జూలై మాసాల్లో తొలకరి పడగానే మొక్కలు నాటే కార్యక్రమం జోరందుకుంటుంది. అయితే ముస్తాబాద్ మండలంలో ఏ ప్రాంతాల్లో ఎన్ని మొక్కలు నాటాలనే ప్రణాళిక ఇప్పటికీ సిద్ధం కాలేదు. వర్షాలు ఆలస్యం కావడం, రేపో మాపో రుతుపవనాలు వచ్చి తొలకరి పలకరిస్తుందనే సమాచారం ఉంటుండగా ఉపాధిహామీ సిబ్బంది ఆ దిశగా పనులు చేపట్టలేదని తెలుస్తోంది.



నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

తగ్గిన లక్ష్యం

మండలంలో 22 గ్రామాల్లో మూడు, నాలుగేళ్ల క్రితం 7 నుంచి 8 లక్షల మొక్కలను ప్రతి సంవత్సరం నాటేవారు. ప్రస్తుతం మొక్కలు నాటేందుకు గ్రామాల్లో స్థలం లేకపోవడంతో లక్ష్యాన్ని కూడా గణనీయంగా తగ్గించారు. గ్రామానికి 10 వేల మొక్కల చొప్పున మండలంలో 2.20 లక్షల మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గ్రామాల వారీగా ఎక్కడ మొక్కలు నాటాలనే ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. గ్రామాల్లో ఎక్కడ ప్లాంటేషన్ చేయాలనే పూర్తి అవగాహన ఉపాధి హామీ సిబ్బందికి ఉందని ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రణాళిక కార్యరూపం దాల్చలేకపోయినా, మొక్కలు ఎక్కడ అవసరమనే విషయంపై స్పష్టత ఉందంటున్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతోనే హరితహారం విజయవంతం అవుతుందనేది వాస్తవం. ఆ దిశగా వారి ప్రమేయం లేకుండా మొక్కలు ఎలా నాటుతారని ప్రకృతి ప్రేమికులంటున్నారు.

మొక్కలు సిద్ధం

మండలంలోని 22 గ్రామాల నర్సరీలలో మొక్కలను ఉపాధిహామీ అధికారులు సిద్ధం చేశారు. జనవరి నుంచే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టగా, ప్రస్తుతం 2.20 లక్షల మొక్కలను సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. వేప, కానుగ, రెయిన్‌ట్రీ, సీతాఫలం, అల్లనేరెడు, బాదం, రావి, మర్రి తదితర మొక్కలతోపాటు పూల మొక్కలను అందించనున్నారు. మండలంలో గతంలో ఒకే రోజు లక్ష మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. అయితే ప్రభుత్వ భూములు, అటవీ భూములు, రహదారులు, కమ్యూనిటీ ప్రాంతాలన్నింటి వద్ద ఎనిమిదేళ్లుగా మొక్కలు నాటారు. ఈ క్రమంలో ప్రస్తుత సీజన్‌లో ఎక్కడ మొక్కలు నాటాలనే అభిప్రాయానికి అధికారులు రానట్లు తెలుస్తోంది. సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలకు కూడా ఈ విషయాన్ని ఇప్పటి వరకు చెప్పలేదు. నూతనంగా వేసిన రహదారులు, గతంలో మొక్కలు నాటని ప్రాంతాలను గుర్తించి, ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీయించి, ట్రీగార్డులు నాటించే ప్రక్రియకు నాంది పలకాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో నాటుతాం



హరితహారంలో ఈ ఏడు మొక్కలు ఎక్కడ నాటాలనే సమీక్ష చేయలేదు. ఎండలు బాగా ఉండడంతో అధికారులు ప్రణాళిక చెప్పలేదని తెలుస్తోంది. మా గ్రామంలో ప్రభుత్వ భూమి 5 ఎకరాల్లో 3 వేల మొక్కలు నాటేందుకు సిద్ధంగా వున్నాం. నాటిన మొక్కలు రక్షించుకునేలా చర్యలు చేపట్టాలి.

– కిషన్‌రావు, సర్పంచ్, తెర్లుమద్ది

రోడ్డు కిరువైపుల నాటాలి



ముస్తాబాద్, పోతుగల్ గ్రామాల మధ్య మొక్కలు పెట్టాలి. మానేరు కెనాల్ వెంబడి ఏనాడు మొక్కలు పెట్టలేదు. అధికారులు ఏం ఆలోచన చేస్తున్నారో తెలియదు. అంబేద్కర్‌నగర్ కెనాల్ వద్ద గతంలో పెట్టిన మొక్కలు ఎండిపోయాయి. హరితహారంపై ప్రజాప్రతినిధులందరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉంది.

– స్వేచ్ఛ, ఎంపీటీసీ, ముస్తాబాద్

వానలు పడగానే ప్రణాళిక సిద్ధం



ప్రస్తుతం విపరీతమైన ఎండలు కాస్తున్నాయి. గ్రామానికి పది వేల మొక్కలు హరితహారంలో నాటాలని సూచించాం. బ్లాక్‌లను ఇంకా గుర్తించలేదు. వానలు పడగానే అందరి భాగస్వామ్యంతో ప్రజలకు ఉపయోగపడేలా మొక్కలు నాటుతాం. ఇప్పటి వరకు గుర్తించని బ్లాక్‌లలో మొక్కలు పెట్టేలా చూస్తాం. అందరి లక్ష్యం పచ్చని తెలంగాణ.

– రమాదేవి, ఎంపీడీవో, ముస్తాబాద్

అమరులకు జోహార్లు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లాలో గురువారం తెలంగాణ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారిని స్మరిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. వారి కుటుంబాలను శాలువాలతో సన్మానించారు. ఎందరో అమరవీరుల త్యాగ ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందన్నారు. అమరవీరులను స్మరించుకోవడం బాధ్యత అన్నారు.



సిరిసిల్లఅర్బన్: నివాళులర్పిస్తున్న బెటాలియన్ సిబ్బంది

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచే శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు అమరవీరులకు నివాళులర్పించి మౌనం పాటించారు.

సిరిసిల్లఅర్బన్: సర్దాపూర్‌లోని పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ జయరాజ్, అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి, నివాళి అర్పించారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంపీడీవో మీర్జా, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ కార్యాలయం ఎదుట అమరుల స్థూపం వద్ద ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు నివాళి అర్పించారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసిల్దార్ తఫాజుల్ హుస్సేన్, ఎంపీడీవో నరేశ్‌కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బండ మల్లేశం, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో రమేశ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడ్డు రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, కోఆప్షన్ సభ్యుడు షాదుల్‌పాషా, ప్రజాప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద, మండల కార్యాలయాల్లో ఎంపీపీ వంగ కరుణ, వైస్ ఎంపీపీ దోసల లత, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మధుసుదన్ రెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల పరిషత్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సంస్మరణ తీర్మానం ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ వేణుగోపాల్, ఎంపీటీసీలు,ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పడిగెల మానస, వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య, ఎంపీడీవో లచ్చాలు, ఏపీవో నాగరాజు, ఎంపీటీసీలు నివాళి అర్పించారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మ, ఎంపీడీవో శ్రీధర్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచ్ రాణి, ఎంపీటీసీ దేవరాజు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో..



ఇల్లంతకుంటలో..



వేములవాడరూరల్: మండల పరిషత్‌లో..



వేములవాడఅర్బన్: మండల పరిషత్‌లో..



సిరిసిల్ల అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ, కలెక్టర్



ముస్తాబాద్‌లో..



తంగళ్లపల్లిలో..



సిరిసిల్లటౌన్: మున్సిపల్ కార్యాలయంలో..



వీర్నపల్లిలో..



బోయినపల్లిలో..

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని జేపీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జేపీ నగర్, పద్మనగర్, అంబికానగర్, వెంకంపేట, ప్రగతినగర్, సుందరయ్యనగర్, శివనగర్ సర్దార్‌నగర్, తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచారం

హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ కే.శ్రీనివాస్ కోరారు. హాస్టల్‌లో 100 సీట్లకు గాను 70 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. హాస్టల్‌లో చేరిన విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నాలుగు జతల దుస్తులు, రెండు దుప్పట్లు, చెప్పులు, బూట్లు, పెట్టె తదితర వస్తువులు అందించడంతో పాటు, స్నానానికి వేడినీటి సౌకర్యం, బంకర్ బెడ్, సౌకర్యాలుంటాయన్నారు. పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నియామకం

డెయిరీ కార్యవర్గం

కోనరావుపేట: మండలం కనగర్తి డెయిరీ చైర్మన్‌గా జిల్లెల్ల లక్ష్మారెడ్డి, డైరెక్టర్లుగా జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, అండెం రాంరెడ్డి, రావులపెల్లి మహిపాల్‌రెడ్డి, మారుపాక రాజయ్య, అనుపాటి హన్మంతరెడ్డి, భూంరెడ్డి, ఎల్లె ప్రభాకర్‌రెడ్డి, జాప పర్శరాములు, ఏరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజిరెడ్డి, టెస్టర్ అజయ్‌రెడ్డి, ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వేగం పెంచండి



మాట్లాడుతున్న ఎంపీడీవో లచ్చాలు

తంగళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అనుకున్న సమయంలోగా పూర్తిచేయాలని ఎంపీడీవో పుట్టి లచ్చాలు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, రెట్రో పిట్స్ నిర్మాణాలు పూర్తి చేసి, సోషల్ ఆడిట్ కొరకు రికార్డులు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో విజేందర్ రెడ్డి, ఏపీవో రాపోలు నాగరాజు, జేఈ రాజనర్సు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొడ్రాయి నిర్మాణానికి భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంటలో బొడ్రాయి నిర్మాణ పనులకు ఎంపీపీ జనగామ శరత్‌రావు గురువారం భూమిపూజ నిర్వహించారు. పాత గ్రామపంచాయతీ ఆవరణలోని స్థలంలో 50 ఏళ్ల క్రితమే ఉన్న బొడ్రాయి కాలక్రమంలో కనుమరుగైంది. గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు పండాలని కోరుతూ బొడ్రాయిని స్థాపిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 5 నుంచి 7 వరకు బొడ్రాయి పూజ కార్యక్రమాలు, పోచమ్మ బోనాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూమయ్య, కరుణాల అనిల్, జింక తిరుపతి, వేణు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్



సిరిసిల్లఅర్బన్: అవగాహన కల్పిస్తున్న నాయకులు



వేములవాడరూరల్: బాలరాజుపల్లిలో..

సిరిసిల్లఅర్బన్: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కేంద్రంలో బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలపై నాయకులు వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీలం రాజు, శ్రీగాధ మైసయ్య, పంపారి అర్జున్, పరుశరామ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర విష్ణువర్ధన్, వంగ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని బాలరాజుపల్లి గ్రామంలో ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, పట్టణ, బూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్ల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్‌రెడ్డి, నాయకులు బోడ మల్లేశం, తిరుపతి, బట్టు పీర్యా, లింగం, రమణ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పార్టీ మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు గుండాడి వెంకట్‌రెడ్డి, కిరణ్‌నాయక్, నేవూరి దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, రామచంద్రారెడ్డి, భాస్కర్, బాపురెడ్డి, సత్యంరెడ్డి, బుగ్గారెడ్డి, బాలాగౌడ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, బందనకల్, ఆవునూర్ గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, నాయకులు క్రాంతికుమార్, కిట్టు, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, వేణు, దేవరాజు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, జిల్లా నాయకులు మోతె గంగారెడ్డి పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

సిరిసిల్లఅర్బన్: యువత చెడు మార్గం వీడి సన్మార్గంలో నడవాలని టౌన్ సీఐ అనిల్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లో మీకోసం కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గం వైపు దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల, డయల్ 100, ట్రాఫిక్ రూల్స్, డ్రంకెన్ డ్రైవ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్ రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్‌లో ఎస్సై రమాకాంత్ మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సర్పంచ్ మల్యాల దేవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌ను డీఈవో రమేశ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థుల తరగతి గది బోధనలను పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు, నూతన విద్యార్థుల నమోదు పాఠ్యపుస్తకాల పంపిణీ మొదలగు అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల కార్యదర్శి శ్రీనివాస్, ఎంఈవో దూస రఘుపతి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రుద్రంగి: స్థానిక రైతు వేదికలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. అధికారులు మూడు నెలల ప్రగతి ప్రణాళికతో సర్వసభ్య సమావేశానికి హాజరై చదివి వినిపించారు. ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి వైస్ ఎంపీపీ చిన్న భూమయ్య, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

సిరిసిల్లఅర్బన్: మెడికల్ కళాశాలకు కేటాయించిన భూములకు పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందొద్దని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం బాధిత రైతులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులో మెడికల్ కళాశాలకు కేటాయించిన భూములకు పరిహారం ఇవ్వకుండానే బల్దియా అధికారులు కందకాలు తీస్తున్నారని బాధిత రైతులు బుధవారం మున్సిపల్ అధికారులను అడ్డుకున్న విషయం తెలిసిందే. తాము ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఈ భూములకు పరిహారం ఇవ్వకుండా, ఎలాంటి సమాచారం లేకుండా కందకాలు తవ్వడం సరికాదన్నారు. తమకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను వేడుకున్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు తెలిపినట్లు రైతులు తెలిపారు. కౌన్సిలర్ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.1.56 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం సర్పంచ్ అంజమ్మ పంపిణీ చేశారు. ఎంపీటీసీ తిరుపతిబాబు, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకి చెందిన జెట్టి సురేష్ అనే వ్యక్తి 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగ గురువారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగ కిరణ్, గంభీరావుపేట ప్రశాంత్ ఉన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల వద్ద ఆర్టీసీ బస్సు బోల్తాపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తెలంగాణ ఫుడ్ కమీషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా క్షతగాత్రులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు

వేములవాడరూరల్: మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామంలో చదువుకుంటున్న చిన్నారులకు అంబేద్కర్ గల్ఫ్ బీమా సేన సభ్యులు పాస్‌లను అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ, పీఆర్‌వో శ్రీనివాస్‌యాదవ్, విలేజ్ బస్ అధికారి అజ్మీరా మల్లేశం పాల్గొన్నారు.